

బియ్యం తూకాల బాధ్యత డీలర్లదే

● జిల్లా సివిల్ సప్లై మేనేజర్ అర్జునరావు



ఫటాఫట్

కడప కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులైన సబ్సిడీ బియ్యం, పంచదార, కందిపప్పు తదితరాలు గోడౌన్ల నుంచి పక్కాగా తూకాలు వేయించు కోవాల్సిన బాధ్యత డీలర్లదే అని జిల్లా సివిల్ సప్లై మేనేజరు అర్జునరావు స్పష్టం చేశారు. బియ్యం తూకాల్లో వ్యత్యాసాలకు సివిల్ సప్లై శాఖ వారు బాధ్యులు కారన్నారు. జిల్లాలో రైతులు పండించిన పంటల కొనుగోలు, ప్రభుత్వ మద్దతు ధరలు, పేదల బియ్యం సరఫరా తదితర అంశాలపై జిల్లా సివిల్ సప్లై మేనేజర్ అర్జునరావుతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

ప్రశ్న: రేషన్ బియ్యం నిల్వలకు ఎన్ని గోడౌన్లు ఉన్నాయి

జవాబు: జిల్లాలో సబ్సిడీ బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర నిల్వల కోసం 13 గోడౌన్లు ఉన్నాయి.

ప్రశ్న: బియ్యం తూకాల్లో వ్యత్యాసాలు రావడానికి కారణాలు

జవాబు: బియ్యం తూకాల్లో వ్యత్యాసాలు వస్తున్నాయంటూ డీలర్లు ప్రచారం చేస్తున్నారు. డీలర్లు గోడౌన్ల వద్దకు వెళ్లి తూకాలు తగ్గకుండా వేయించుకున్న తరువాతే బయోమెట్రిక్ వేయాలి. డీలర్ల నిర్లక్ష్యం వల్ల సివిల్ సప్లై శాఖపై ఆరోపణలు చేయడం తగదు. తూకాల్లో తక్కువపై తెల్లరేషన్ కార్డుదారులు నిలదీసి అడిగితే.. తూకాల్లో డీలర్లు జాగ్రత్తలు తీసుకుంటారు.

ప్రశ్న: ఏమేమి సరుకులు పేదలకు సరఫరా అవుతున్నాయి

జవాబు: తెల్లరేషన్ కార్డులున్న 5.76 లక్షలమంది కుటుంబాలకు సంబంధించి ప్రతినెల ప్రభుత్వం బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు, జొన్నలు, రాగులు, గోధుమపిండి తదిరాలు గోడౌన్‌కు చేరుతుంటాయి.

ప్రశ్న: తృణధాన్యాలు సరఫరా అవుతున్నాయా?

జవాబు: పేదలకు ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు కూటమి సర్కారు తృణధాన్యాల పంపిణీకి ప్రాధాన్యత ఇస్తోంది. 3 నెలలుగా నాణ్యతతో కూడిన కంది పప్పుతో పాటు బియ్యం బదులుగా గోధుమలు, రాగులు కూడా వస్తున్నాయి. కందిపప్పు కొరత లేకుండా డీలర్లకు అందజేస్తున్నాం. అందులో కొందరు డీలర్లు, ఎండీయూలు కందిపప్పును పేదలకు సరిగా అందజేయకపోవడం వల్ల మా శాఖకు నిందలు తప్పడం లేదు.

ప్రశ్న: రైతుల నుంచి ధాన్యం సేకరణ చేస్తున్నారా

జవాబు: రైతులు పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది. అయితే బయట మార్కెట్‌లో రైతుల పంటకు మంచి ధరలు ఉంటే అమ్ముకోవచ్చు. వరికి గ్రేడ్-1కు రూ.2,320లు మద్దతు ధర చెల్లిస్తున్నాం. జొన్నలు 20 మెట్రిక్ టన్నుల మేరకు క్వింటాకు రూ.3,180తో కొనుగోలు చేశాం.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది మిల్లర్లు ఉన్నారు?

జవాబు: జిల్లాలో గతంలో పెద్ద ఎత్తున రైస్ మిల్లర్లు ఉన్నారు. బ్యాంకుల గ్యారంటీల కారణంగా 10 మంది మిల్లర్లకు అనుమతులు లేవు. ప్రస్తుతం కడప, ఖాజీపేట, బద్వేలు, పోరుమామిళ్లలో ఒకరు చొప్పున మిల్లర్లు ఉన్నారు.

ప్రశ్న: మిల్లర్లకు సివిల్ సప్లై శాఖకు సంబంధం ఏమిటి

జవాబు: పేదలకు సబ్సిడీతో అందించే బియ్యం గతంలో పంజాబు, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యేవి. అందులో నాణ్యత ఉండేది కాదు. ఇప్పుడు మన జిల్లాతో పాటు రాష్ట్రంలో రైతులు పండించే మేలు రకాలైన జగిత్యాల, బీపీటీఎల్, నంద్యాల, ఎన్‌డీఎల్‌ఆర్ వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొని గుర్తించిన 4 రైస్ మిల్లర్ల నుంచి నాణ్యతగా తయారు చేయిస్తున్నాం. ముఖ్యంగా పేదలకు ఆరోగ్యంగా బలవర్థకంగా పౌష్టికాహారం ఉండేలా బ్లైండింగ్, ఫోర్టిఫైడ్ రైస్‌ను కూడా కలిపేందుకు మిల్లర్ల వద్ద యంత్రాలు ఉన్నాయి.

పల్లెలకు మహర్దశ



వేముల మండలం వి.కొత్తపల్లెలో నిర్మించిన సీసీ రోడ్డు



పర్లపాడులో తారురోడ్డు



వేంపల్లె మండలంలోని కుమరంపల్లెలో పొలాల్లో వేసిన మట్టిరోడ్డు

● సీసీ రోడ్లతో మారుతున్న రూపురేఖలు

● పాడి రైతుకు భరోసా

● పల్లెల ప్రగతిపై కూటమి ప్రభుత్వం దృష్టి

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాం వరకు చినుకు పడినా రోడ్లన్నీ బురదమయంగా మారేవి. ఇక ఇళ్ల నుంచి వచ్చే వృధా నీరు మురుగు కాల్వలు లేక రోడ్లపైకి చేరుతుండటంతో నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఉండేది. ఈ సమస్యలన్నింటికీ ఇప్పుడు ఫుల్‌స్టాప్ పడింది. గజిబిజి రోడ్లన్నీ సిమెంటు రోడ్లుగా మారుతున్నాయి. రాళ్లు, రప్పలతో ఉన్న రహదారులు తారురోడ్లుగా మారాయి. ఇక మట్టిరోడ్లు కూడా నిర్మాణంలో ఉన్నాయి. జగన్ హయాంలో పల్లెప్రగతి పడకేయగా.. మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వంలో అభివృద్ధి పురుడు పోసుకుంది. పల్లెల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, తారురోడ్లు, మెటల్ రోడ్లు, పశువుల కొట్టాల నిర్మాణాలు సాగి ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి.

మళ్లీ అభివృద్ధి జాడలు

అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని శాశ్వత అభివృద్ధిని చేయాలనేది సీఎం చంద్రబాబునాయుడు విజన్. గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులను జగన్ సర్కారు సరిగా వినియోగించుకోలేకపోయింది. 2014-19 టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ ఈ నిధులు సమర్థవంతంగా వినియోగించుకుని పల్లెలను అభివృద్ధిబాట పట్టించారు. ఆ తరవాత జగన్ సర్కారు పట్టించుకోకుండా వదిలేసింది. అయితే ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో పీఆర్ శాఖను చూస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉపాధి నిధులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు, పల్లెలను అభివృద్ధి చేసేందుకు ఒక ప్రణాళిక రూపొందించారు. ఏ పల్లెకు ఏం కావాలనో పంచాయతీ ప్రజలు ఓ ప్రణాళిక తయారు చేస్తున్నారు. ప్రస్తుతం తొలి విడతలో జిల్లాలో రూ.84.86 కోట్లతో 1071 పనులు చేపడుతున్నారు.

ఇప్పటి వరకు చేసిన పనులు

పనుల వారీగా చూస్తే జిల్లాలో తొలివిడతలో రూ.64.23 కోట్ల వ్యయంతో 130 కి.మీ సిమెంటు రోడ్లను నిర్మించేందుకు గాను 986 పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 750 పనులు పూర్తి చేశారు. ఇందులో 105.66 కిమీ సీసీ రోడ్డు పూర్తి చేశారు. ఇక రూ.12.06 కోట్లతో 26 కి.మీ మేర 12 వీధిరోడ్లను చేపట్టారు. ఇప్పటికి 4 పూర్తి చేసి 5.64 కిమీ బీటీ రోడ్డు వేశారు. ఇక రూ.6.3 కోట్లతో 30.69 కి.మీ మేర డబ్ల్యుబీఎం రోడ్ల నిర్మాణానికి 35 పనులు ప్రారంభించారు. ఇప్పటికి 11 పనులు పూర్తి చేసి 8.49 కిమీ మేర రోడ్లు వేశారు. రూ.2.52 కోట్లతో 2.34 కి.మీ మేర ప్రహరీ గోడ నిర్మించేందుకు 37 పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే రెండు పనులు పూర్తి చేసి 0.175 కి.మీ పూర్తిచేశారు. ఇంత వరకు అన్నీ కలిపి 1071 పనులకు గాను 767 పూర్తి చేశారు.

రూ.18.31 కోట్లతో పశువుల షెడ్లు

రైతు అంటేనే వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ కూడా. పాడి పరిశ్రమ అదనపు ఆదాయాన్ని కల్పిస్తుంది. రైతుల కోసం ఉపాధి హామీ పథకంలోని పశువుల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో రూ.18.31 కోట్ల వ్యయంతో 825 పశువుల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 396 పశువుల షెడ్లను పూర్తి చేశారు. ఇటీవలే పల్లెపండుగ పేరుతో పూర్తయిన వాటిని ప్రారంభించారు. మిగతా వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ఐదేళ్ల జగన్ హయాంలో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. కేంద్రమిచ్చే ఆర్థిక సంఘం నిధులు కూడా అప్పట్లో జగన్ సర్కారు ఇతర వాటికి బదిలీ చేసి వాడేసుకుంది. కొంత సొమ్ము విద్యుత్ బకాయిలకు చెల్లించింది. వెరసి.. కనీసం బ్లీచింగ్ పౌడరు చల్లేందుకు కూడా నిధులు లేని పరిస్థితి దాపురించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పంచాయతీలకు పూర్వ వైభవంతో పాటు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. పల్లె పండుగ పేరుతో జిల్లాలో సుమారు రూ.84.86 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, బీటీ రోడ్లు, మెటల్ రోడ్ల నిర్మాణపనులు సాగుతున్నాయి. పూర్తయిన వాటిని సంక్రాంతికి ముందు కొన్ని పనులను ప్రారంభించారు.



సీకేదిన్నెలో పశువుల షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి (ఫైల్‌ఫొటో)

పాఠశాలల బలోపేతానికి కృషి

● ప్రతి గ్రామంలో ఆదర్శ పాఠశాల

● పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని పాఠశాలల విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం కడప నగరం జడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జీవోనెంబర్-117 ఉపసంహరణ, అనంతరం పరిణామాలు, ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న చోట రెండు గ్రామాలకు కలిపి ఒకేచోట ప్రాథమిక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో 80 మంది విద్యార్థుల సంఖ్య తగ్గకుండా పాఠశాలను ఏర్పాటు చేసి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, నియోజకవర్గ స్పెషలాఫీసర్లు, జడ్పీ సీఈఓ, సోషల్ వెల్ఫేర్ డీడీ, ఐసీడీఎస్ పీడీ, ఆర్జేడీ, డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటుకు దేశాన్ని శాసించగలరు


● 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలి ● జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్



జాతీయ ఓట్లర దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్ తదితరులు

కడప కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వజ్రాయుధమని, తన ఓటుతో దేశాన్ని శాసించగల శక్తి ఓటర్లకు ఉందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే శక్తి విలువైన ఓటరుకు ఉందన్నారు. కుల మత లింగ భేదం లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతి ఒక్కరికి ఓటు హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. 18 ఏళ్ల నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నిష్పక్ష పాతంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా బాధ్యతాయుతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 90 కోట్ల మందికి ఓటు హక్కు ఉన్న ఏకైక ప్రజాస్వామ్య దేశం మనదే అన్నారు. 70 శాతం మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, ఒక్క ఓటే కదా అంటూ ఓటు వేయడం మానేస్తున్నారన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. జిల్లాలో కొత్తగా ఓటర్లుగా నమోదైన యువతీ యువకులకు ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటరు ఎపిక్ కార్డులను అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఎక్కువ శాతం ఓటర్లను నమోదు చేసిన సూపర్‌వైజర్లు, బీఎల్వోలకు కలెక్టర్, జేసీ చేతుల మీదుగా జ్ఞాపికలను ప్రదానం చేశారు. అంతకు ముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొలుత ఉదయం 10 గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా అధికారులు ఆనంద్ నాయక్, సురేశ్ రెడ్డి, సరస్వతి, సాయిగ్రేస్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర ఇసుక ట్రాక్టరును పట్టుకున్న అధికారులు



ఇసుకాసురులపై దాడులు

● నిషేధిత ప్రాంతంలో ఇసుక తవ్వితే కేసులు పెడతాం

● వెల్లడించిన తహశీల్దారు, కమిషనర్

ప్రొద్దుటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులు శనివారం మధ్యాహ్నం దాడులు చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఇసుకాసురుల విధ్వంసం' అనే కథనానికి స్పందించిన అధికారులు.. రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో రైల్వే వంతెన దగ్గర పరిశీలించారు. తహశీల్దారు గంగయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున నదిలోకి దిగి ట్రాక్టర్లను వెంబడించారు. దీనిని పసిగట్టిన ఇసుక అక్రమార్కులు ట్రాక్టర్లలోని ఇసుకను అన్‌లోడు చేసి పరార్ అయ్యారు. ఒక ట్రాక్టర్ స్టార్ట్ కాకపోవడంతో అక్కడే వదిలి వెళ్లారు. తహశీల్దారు గంగయ్య నదిలో రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ఆర్టీపీపీ రోడ్డు బ్రిడ్జి వరకు రెండు కిలోమీటర్లు నడిచారు. రెండు ట్రాక్టర్లను పట్టుకోగా మరికొన్ని ట్రాక్టర్ల ఫొటోలు తీసి నెంబర్లు రికార్డు చేసుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను రూరల్ పోలీసు స్టేషనుకు తరలించారు.

దాడుల అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో కలిసి తహశీల్దారు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం వాస్తవమే అన్నారు. రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఇసుక అక్రమ రవాణా సాగుతోందన్నారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో కల్లూరు, నంగనూరుపల్లె, చౌడూరు గ్రామాల వద్ద పెన్నానదిలో ఇసుక తీసుకువెళ్లడానికి అనుమతులు ఉన్నాయన్నారు. అదికూడా ఇళ్లు కట్టేవాళ్లు ఆయా సచివాలయాల్లో టోకన్‌లు ఉచితంగా పొంది ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకోవచ్చన్నారు.

ప్రొద్దుటూరులో ఎర్రగుంట్ల రోడ్డు, పెన్నా బ్రిడ్జి నుంచి రామేశ్వరంలోని రైల్వే వంతెన పై వరకు ఎక్కడా పెన్నానదిలో ఇసుక తవ్వకాలు జరపరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా నదిలోకి దిగి ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులతో పాటు భారీగా జరిమానా విధిస్తామన్నారు. రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద, రైల్వేవంతెన దగ్గర నదిలో ఇసుక తవ్వకాలు ప్రమాదాన్ని తలపిస్తున్నాయన్నారు. నదిలో ఇసుక ఖాళీ అయిందన్నారు. దీనివలన నదిలో నీళ్లు భూగర్భంలోకి ఇంకవన్నారు. తద్వారా భూగర్భ జల మట్టం పడిపోయి నీటి సరఫరాకు తీవ్ర ఆంటంకం ఏర్పడుతుందన్నారు. ఇది పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. వాటర్ వర్క్స్ వెళ్లే రహదారిలో, ఆర్టీపీపీ బ్రిడ్జి రోడ్డులో ఎక్కడ ట్రాక్టర్లు ఇసుక లోడుతో వచ్చినా పట్టుకుంటామన్నారు. రెండు రోజుల్లో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడానికి వీఆర్వో, వీఆర్ఏలతో ప్రత్యేక టీంలు వేసి పెన్నానది పరివాహక ప్రాంతమంతటా నిఘా పెంచుతామన్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన చోట మాత్రమే ఉచిత ఇసుక తీసుకెళ్లాలన్నారు.



అధికారుల దాడులతో నదిలో ట్రాక్టరును వదిలేసిన వెళ్లిన దృశ్యం

వారంతా ఏమయ్యారో..

● జిల్లాలో 556 మంది అదృశ్యం ● 487 మంది గుర్తింపు ● ఇంకా ఆచూకీ లభించని 69 మంది

జిల్లాలో అదృశ్యమయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సంతోషంగా గడపాల్సిన కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఒకరు అదృశ్యమైతే ఆ బాధ వర్ణనాతీతం. బాలికలైతే దాదాపు ప్రేమ పేరుతో వెళ్లిపోతుండగా.. మహిళలు కుటుంబ కలహాలు, ప్రేమ వ్యవహారంతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. వీరు అదృశ్యమయ్యాక ఎవరితో సంబంధాలు లేకపోవడం, మొబైల్ ఫోన్లు వాడకపోవడంతో వీరిని గుర్తించడం కష్టంగా మారుతోంది. మిస్సింగ్ అయిన వారు కొందరు ఎక్కడో చోట శవాలుగా తేలుతూ గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలుగా నమోదు చేసుకుంటున్నారు. జిల్లాలో గత ఏడాది డిసెంబరు 31వ తేదీనాటికి 556 మంది అదృశ్యమయ్యారు. వీరిలో 69 మంది ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాలేదు.



కడప క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వారు ఎక్కడున్నారో.. ఏమయ్యారో తెలియక బాధిత కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. పోలీసులు మిస్సింగ్ కేసులు నమోదు చేస్తున్నారు. కానీ కేసు దర్యాప్తు మాత్రం కాస్త ఆలస్యంగానే సాగుతోందని అర్థమవుతోంది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు 31వ తేదీనాటికి మహిళలు, బాలికలే అధికంగా అదృశ్యమయ్యారు. బాలురు 22 మంది అదృశ్యం కాగా, 17 మందిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా ఐదుగురి జాడ ఇంకా తెలియరాలేదు. బాలికలు 134 మంది అదృశ్యం కాగా, 128మందిని గుర్తించారు. మరో ఆరుగురిని గుర్తించాల్సి ఉంది. మహిళలు 276 మంది అదృశ్యం కాగా 255 మందిని గుర్తించారు. మరో 21 మంది ఆచూకీ లభ్యం కాలేదు. పురుషులు 124 మంది అదృశ్యం కాగా 87 మందిని గుర్తించగా, 37 మంది ఆచూకీ ఇంకా తెలియడంలేదు. అదృశ్యమైన వ్యక్తి పూర్తి వివరాలు, ఫొటోలను తీసుకుని పోలీసు గ్రూపులు, సోషల్ మీడియాలో ప్రచారం సాగిస్తున్నా వారి ఆచూకీ లభ్యం కావడంలేదు. ఏళ్లు, నెలలు గడుస్తున్నా కొందరి ఆచూకీ లభ్యం కావడం లేదు. ఇలాంటి కేసులు తాత్కాలికంగా మూసివేస్తున్నారు.

అదృశ్యానికి కారణాలు ఎన్నో

ఇటీవల సరిగా చదువుకోలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఇద్దరు బాలికలు రైలు ఎక్కి తిరుపతికి వెళ్లిపోయారు. వారి కోసం రెండురోజులు కుటుంబ సభ్యులు, పోలీసులు వెదకడంతో చివరికి రైల్వేస్టేషన్ సమీపంలో వారు తిరుగుతున్న సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన వారిని గమనిస్తే.. మతిస్థిమితం సరిగా లేక వెళుతున్న వారు కొందరైతే, మరికొందరు మహిళలు భర్త, అత్తమామలు ప్రేమగా చూడలేదంటూ వేరే వ్యక్తులతో సంబంధం పెట్టుకుని తమతో పాటు పిల్లలను కూడా తీసుకుని వెళ్లిపోయిన సంఘటనలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. మరికొందరు ఇంటిపెద్దలు పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాక తమను సరిగా చూసుకోవడం లేదనే భావనతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ప్రైవసీ పేరుతో కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు కొరవడడం, ఈ బిజీ లైఫ్‌లో కుటుంబసభ్యులతో ఎక్కువగా గడపలేకపోవడంతో కొందరు ఈ అవకాశాన్ని అలుసుగా తీసుకుని మాయమాటలతో మహిళలను తీసుకెళ్లిపోతున్నారు. వీరిలో కొందరు తిరిగి రాగా వారిని కౌన్సెలింగ్‌తో మార్చి యథాస్థితికి చేరుస్తున్నారు. మరికొందరైతే పోయిన వారితోనే సెటిల్ అవుతున్నారు. ఏదిఏమైనా సర్దుకుపోయే సమస్యలకు పెద్ద భూతద్దంలో చూస్తూ ఇంటి నుంచి వెళ్లిపోతుండడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదనకు లోనవుతున్నారు. రానురాను ఇటువంటి కేసులు జిల్లాలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా 25 నుంచి 40ఏళ్ల లోపు మహిళలే ఎక్కువగా ఇల్లు విడిచి వెళ్లిపోతున్నారు. జిల్లాలో గత ఏడాది 69 మంది ఆచూకీ లభ్యం కాకపోవడం కలవరపెడుతోంది.

మహిళ అదృశ్యమంటే చులకనభావన

తమ బిడ్డ, తమ ఇంటి ఇల్లాలు అదృశ్యమైందని



పోలీసులకు తెలపాలన్నా చుట్టుపక్కల వారికి తెలిస్తే చులకన అవుతామని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అదృశ్యమైంది మేజరా, మైనరా అని ప్రశ్నించడం.. ఎవరితో అయినా ప్రేమాయణం సాగించి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు తమ బిడ్డ బంధువులు ఇంటికి వెళ్లిందని చెప్పుకుంటూ ఆచూకీ కోసం స్వయంగా వారే గాలింపు చర్యలు చేపడుతున్న సందర్భాలున్నాయి. మహిళ అదృశ్యమైతే వివాహేతర సంబంధాలు అంటగడుతుంటారు. ఈ నేపథ్యంలో వివాహితలు అదృశ్యమైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి జంకుతున్నారు. జిల్లావ్యాప్తంగా బాలికలు, మహిళలే ఎక్కువ శాతం అదృశ్యమయ్యారు. గత ఏడాది మొత్తం 556 మంది అదృశ్యమవగా ఇందులో బాలికలు, మహిళలు కలిపి 410 మంది ఉన్నారు. బాలురు 22 మంది, పురుషులు 124 మంది అదృశ్యమయ్యారు. అదృశ్యమైన 556 మందిలో 69 మంది ఆచూకీ ఇప్పటికీ దొరకలేదు. ఈ 69 మందిలో 37 మంది పురుషులే ఉన్నారు. ఏదిఏమైనా మిస్సింగ్ కేసులపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మొక్కల సంరక్షణ మన బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మొక్కల సంరక్షణ మన బాధ్యతని ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలోని సీతాకోకచిలుకల పార్కు విస్తరణలో భాగంగా ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సీతాకోకచిలుకల ఉద్యానవనంలో మొక్కలు పెంచడం చాలా ఆనందదాయకమన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

పులివెందుల రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):ఇస్లాంపురం జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా శాసన సభ సమావేశం జరిగే విధానాన్ని నిర్వహించారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పాత్ర పోషించి సభ్యులు ప్రశ్నల వర్షం, అధికార పక్షం సమాధానాలతో సందడిగా సాగింది.

వైద్యపరికరాలు నిరుపయోగమైతే ఎలా?



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్య పరికరాలు నిరుపయోగమైతే ఎలా అని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం చెన్నూరు సీహెచ్‌సీలో నిర్వహించిన అభివృద్ధి సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్స్‌రే ప్లాంటు ఉన్నా చాలా కాలంగా పనిచేయడం లేదని, వీల్‌ఛైర్ లేదని, కంటి, చర్మవ్యాధుల వైద్యులు, ఫిజియోథెరపి లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే ఎక్స్‌రే మిషన్ ఎందుకు చెడిపోయింది, ఎందుకు తయారు చేయలేదని టెక్నీషియన్‌ను ప్రశ్నించారు. అతను మదర్‌బోర్డు పోయిందని చెప్పడంతో వెంటనే సంబంధిత వ్యక్తికి ఫోను చేయడంతో ఆ వ్యక్తి రాజమండ్రి నుంచి తీసుకువస్తాం... టైం పడుతుందనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్స్‌రే మిషను రెండు, మూడు రోజుల్లో తీసుకువచ్చి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. అలాగే కంటి, చర్మ వ్యాధుల వైద్యులను వారంలో రెండు మూడురోజులైనా పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. ఫిజియోథెరపిస్టును కూడా వచ్చేలా చూస్తామన్నారు. అలాగే మరో భవనంలో సీహెచ్‌సీ నడవడం ఏమిటి, ఫస్ట్ ఫ్లోరు ఇంతవరకు ఎందుకు పూర్తి కాలేదని ఇంజనీర్లను ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ డీసీహెచ్ఎస్ నిర్వాకం వల్లే ఈ భవనం పరిస్థితి ఇలా మారిందన్నారు. కాంట్రాక్టరు పనులు సరిగా చేయలేదని, బిల్లులు నిలిపి బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. వైద్యాధికారి సాగర్‌కు మారి మాట్లాడుతూ వైద్యశాలలో రెండు ఏఎన్ఎం పోస్టులు, ఒక జూనియర్ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉందన్నారు. సరైన వైద్య భవనం లేనందు వల్ల పెద్ద ఆపరేషన్లు చేయలేక పోతున్నామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించండి

అనంతరం ఎమ్మెల్యే ఇంజనీర్లను పిలిచి గతంలో రూ.4.70 కోట్లు మంజూరైంది కదా.. ఆ నిధులు వెనక్కి వెళ్లకుండా త్వరగా నిర్మాణంలో ఉన్న భవనానికి చుట్టూ ప్రహరీ, సిమెంటు రోడ్లు, జనరేటరు, ఆర్వోప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. అంచనాలు వేసి పనులు ప్రారంభించాలన్నారు. ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, తహసీల్దారు సరస్వతి, టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, వైద్య మండలి సభ్యులు మణ్యం మోహన్‌రెడ్డి, గోదిన శ్రీనివాసులు, చిన్న పిల్లల వైద్యుడు శివశంకర్, వైద్యులు, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

నిధులు తెస్తా : ఎమ్మెల్యే

మండలానికి నిధులు తెస్తానని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. ఆయన ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, తహసీల్దారు సరస్వతి, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డితో మాట్లాడారు. నిధులు ఒక్కపైసా కూడా పక్కదారి పట్టకుండా చూడాలన్నారు.

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెన్నూరు లాంటి పెద్ద పంచాయతీకి రెండు మినీ చెత్త సేకరణ ఆటోలు కూడా అందిస్తామన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

హైవే రహదారిలో చెన్నూరు వద్ద సర్వీసు రోడ్లు, డ్రైనేజీ, బస్‌షెల్టర్లు సరిగా లేవని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకురావడంతో ఆయన వెంటనే హైవే ప్రాజెక్టు డైరెక్టరు, ఆర్టీసీ ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. పెండింగు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను ఇబ్బంది లేనిచోట నిలిపి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆర్ఎంకు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

కమలాపురం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో అంగన్వాడీ సెంటరును ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అవసరమైన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ పిల్లలతో మాట్లాడారు.

సంక్షిప్తం

నేడు మాంసం విక్రయించరాదు

కమలాపురం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం గణతంత్ర దినోత్సవ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో ఎలాంటి మాంసం విక్రయించరాదని నగర పంచాయతీ కమిషనరు జగన్నాథం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో మాంసం విక్రయాలను బంద్ చేశామన్నారు. నగర పంచాయతీ పట్టణ పరిధిలోని చికెన్, మాంసం, చేపల దుకాణదారులకు, మాంసాహార హోటళ్ల యజమానులకు జంతువధను నేడు నిషేధించామన్నారు. ఉత్తర్వులు పాటించని యజమానులపై రూ.5వేలు జరిమానా విధించబడుతుందని తెలిపారు.

ఓటు వజ్రాయుధం

పులివెందుల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధమని పులివెందుల డివిజను ఆర్డీవో చిన్నయ్య పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు కార్యాయలంలో 70 సంవత్సరాలు పైబడ్డ వయసు ఓటర్లను సత్కరించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దరు మహ్మద్‌నజీర్, డిప్యూటీ తహసీల్దారు వెంకటరెడ్డి, ఆర్ఐ షేక్షావలి, గర్ల్స్ కళాశాల విద్యార్థులు, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం శిల్పారామంలో ఈనెల 26న సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 వరకు కడపకు చెందిన పోదార్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మిస్పా మూవీ వారి సహకారంతో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో దేశభక్తి, జానపద, సినీ గీతాలకు ఆ స్కూల్ విద్యార్థులు నృత్యాలు చేయనున్నట్లు వెల్లడించారు.

మహాసభలను జయప్రదం చేయండి

కడప(వినాయకనగర్), జనవరి25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐఎంఏ హాలులో ఫిబ్రవరి 12, 13వ తేదీల్లో జరగనున్న అఖిల భారత అగ్రగామి మహిళా సమితి (ఎయిమ్స్) రాష్ట్ర మొదటి మహాసభలను జయప్రదం చేయాలని పార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందరరామరాజు పిలుపునిచ్చారు. మహాభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి పూర్బిమాబీస్వాస్, సభ్యురాలు పీఎస్ఆర్ఎస్ ప్రవర్ణిక హాజరవుతున్నట్లు తెలిపారు. పార్వర్డ్ బాక్లర్ పార్టీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు సుబ్బమ్మ, హిమబిందు, అరుణకుమారి పాల్గొన్నారు.

'హెల్మెట్‌ను తప్పక వాడండి'

పులివెందుల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహన వినియోగదారులు హెల్మెట్‌ను తప్పక వాడాలని ఎంవీఐ బీవీ ప్రసాద్ తెలిపారు. శనివారం 36వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలలో భాగంగా స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ పట్టణ సీఐ హాజీవలి, లయోలా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): లింగాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం లింగాల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం సుభాషిణి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల ఆరోగ్య పథకంలో భాగంగా వైద్యకేంద్రం పరిధిలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన వస్తుందని ప్రమాదకర వ్యాధులు ఉన్న వారికి ప్రాథమిక దశలో చికిత్స అందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేష్ రెడ్డి, వికలాంగుల విద్యా సహాయకుడు రఘునాథ్‌రెడ్డి, సీహెచ్‌ఓ పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

వేంపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా వేంపల్లె ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవోపా ప్రతినిధులునాగలక్ష్మి, సింధూరి, లక్ష్మి పాల్గొన్నారు. ప్రోత్సాహక బహుమతులను బీజీఎస్ ఎలక్ట్రానిక్స్ అందజేశారు.

'ఆర్పీపై చర్యలు తీసుకోండి'

కడప మారుతీనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా స్వయం సహాయక సభ్యులను నమ్మించి మోసగించిన ఆర్పీ వేదమణితో పాటుగా ఆమె కుమారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని నగర నాగరాజుపేట విజయభారతి స్వయం సహాయక సంఘ సభ్యులు క్రిష్ణకుమారి, షేక్ మెహరాబి జిల్లా అధికారులను కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఎస్పీని కలిసిన కమలాపురం ఎమ్మెల్యే, నాయకులు



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్నశివశంకర్‌రెడ్డి, అమీర్‌బాబు, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కడప క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా నూతన ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో శనివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు మైనార్టీ నాయకుడు వీఎస్ అమీర్‌బాబు ఎస్పీ ని కలిసి మర్యాదపూర్వకంగా బొకే శాలువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం నగరంలో శాంతి భద్రతలు నెలకొల్పుటలో పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈయన వెంట టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, దళిత నాయకుడు ఆమూరి బాలదాసు, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ అష్రఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రేరణ తరగతులు



మాట్లాడుతున్న డీడీ సరస్వతి

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదవి తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. కడప సహాయ సక్షేమ అధికారి పరిధిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాంఘిక, సక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సరస్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు మెళకువలతో కూడిన పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఏఎస్‌డబ్ల్యూఓ లక్ష్మీనారాయణ, వసతి గృహాల సంక్షేమ అధికారులు లీలావతి, వెంకటరమణ, శిరీష, పద్మ, వెంకట రమణయ్య, మరియమ్మ, ట్యూటర్లు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' హామీల అమలెప్పుడు: కాంగ్రెస్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, అఫ్జల్ ఖాన్ తదితరులు

కడప కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలెప్పుడని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టరేట్ ఎదుట ప్లేట్లు, స్పూన్లతో వినూత్నంగా శబ్దం చేస్తూ కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి మాట్లాడుతూ మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని నిద్రలేపేందుకు కాంగ్రెస్ 'థాలీ భజావో' కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇచ్చిన హామీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్ రెడ్డి, ఎస్ఏ సత్తార్, మహమ్మద్ అలీఖాన్, కదిరి ప్రసాద్ గౌడ్, మామిళ్ల బాబు, శ్యామలమ్మ, శివమోహన్ రెడ్డి, ఇర్ఫాన్‌బాషా, అశోక్‌రెడ్డి, మహబూబ్ బాషా, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



షాబుద్దీన్‌కు నియామక పత్రం అందజేస్తున్న కౌన్సిల్ చైర్మన్ షా మహ్మద్

కడప మారుతీనగర్ జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్‌నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ షా మహ్మద్ ప్రజలను కోరారు. కౌన్సిల్ జిల్లా నూతన అధ్యక్షుడు సయ్యద్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక జిల్లా, నగర నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

జిల్లా నూతన అధ్యక్షుడిగా షాబుద్దీన్

షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా సయ్యద్ షాబుద్దీన్ నియమితులయ్యారు. నగర అధ్యక్షుడిగా ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. కౌన్సిల్ నాయకులు బాదుల్లా, మహిళా అధ్యక్షురాలు ఆస్మా, జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహీర్, ఖూన్‌కారిష్మా నాయకులు తారీక్, జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, స్వచ్ఛంద సంస్థల నేతలు పాల్గొన్నారు.

జీరో సర్వీస్‌తో ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాలి

● పాఠశాల కమిషనర్‌కు ఎస్టీయూ వినతి



విజయరామరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి సెలవులలో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీలను జీరో సర్వీస్ ప్రామాణికంగా చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప జడ్పీ ఆవరణంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023మే, జూన్ నెలలో పదోన్నతులు చేపట్ట డం రాష్ట్రంలో ఆనాడు నూతన జిల్లాలు ఏర్పడడం వల్ల చాలా మంది సుదూర ప్రాంతాలకు పదోన్నతిలో భాగంగా వెళ్లారన్నారు. అలాగే ప్ర స్తుతం డీఎస్సీ ద్వారా నూతన నియామకాలు చేపడుతున్న తరుణంలో జీరో సర్వీస్‌తో బదిలీలు నిర్వహిస్తే కొందరికైనా న్యాయం జరుగుతుందన్నారు. అలాగే 8 ఏళ్ల గరిష్ట పరిమితి కాకుండా 8 అకడమిక్ ఇయర్స్ గరిష్ట పరిమితిగా బదిలీలు నిర్వహించాలన్నారు.

'ఉరుసును విజయవంతం చేయండి'

కడప కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేదర (ఎం.ఆర్ స్ట్రీట్)లో వెలసిన సయ్యద్ షా నాదర్ షావలీ ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని మైనార్టీ నాయకులు సుబాన్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల ఆయన కార్యాలయంలో ఉరుసు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

నగరంలో సంవిధాన్ గౌరవ దివస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప మారుతీనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సంవిధాన్ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం 4కె కడప ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జా తీయ, రాష్ట్ర పార్టీల పిలుపు మేరకు చేపట్టిన రాజ్యాంగ గౌరవ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సు బ్బారెడ్డి, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్‌కుమార్, జిల్లా నాయకులు సురేంద్ర, ప్రవీణ్‌నాయుడు, ఓబులేసు, శ్రీకాంత్, మహిళా మోర్చా నాయకురాలు పద్మావతి బాయి, శోభాబాయి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధికారి మార్పు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖ మాజీ అధికారి శివశంకర్‌రెడ్డి సేవలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కడప జిల్లా ప్రత్యేకాధికారి జిల్లా రెవె న్యూ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు నూతన కార్యవర్గం ఏర్పాటు

కడప క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ వద్ద ఉన్న కమ్మ సంఘం సంక్షేమ భవన్‌లో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

కంచన్నగారిపల్లె, పెద్దచెప్పలిలో పశు వైద్య శిబిరం

కమలాపురం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం మండలం కంచన్నగారిపల్లె, పెద్దచెప్పలిలో శనివారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కంచన్నగారిపల్లెలో 24 పశువులకు సాధారణ చికిత్సలు, 8 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 378 పశువులకు నట్టల నివారణ మందు, 197 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందించినట్లు వైద్యు లు తెలిపారు. అలాగే పెద్దచెప్పలిలో 82 సాధారణ చికిత్సలు, 17 గర్భ సంబంధ చికిత్సలు, 3 ఎద సూదులు, 37 దూడలకు ఏలికపాముల మందులు, 293 జీవాలకు నట్టల నివారణ మందు తాపించామన్నారు. కోగటం జేవీవో రామాంజనేయులు, సచివాలయ ఏహెచ్‌ఏలు రమేశ్, సుబ్బలక్ష్మి, శిరీష, జ్యోతి, రుక్సానా, కీర్తన సచివాలయ ఏహెచ్‌ఏలు సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కర్లింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థినికి బంగారు పతకం

కమలాపురం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జమ్ము అండ్ కశ్మీర్‌లో జరిగిన నాలుగో జాతీయ స్థాయి కర్లింగ్ పోటీల్లో స్థానిక బీఆర్ అంబేద్కర్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. మొత్తం ఐదుగురు పోటీల్లో పాల్గొనగా అందులో పదో తరగతి చదువుతున్న దీక్షిత మిక్స్ డబుల్స్‌లో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నారు. అలాగే 9వతరగతి చదువుతున్న హారిక మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం కైవసం చేసుకున్నారు. శనివారం డీపీవో ఉదయశ్రీ, ప్రిన్సిపాల్ తులశమ్మ, ఉప ప్రిన్సిపాల్ లక్ష్మినరసమ్మ, పీఈటీ చంద్రకళావతి, ఉపాధ్యాయినులు విజేతలైన విద్యార్థినులను అభినందించారు.

గానగంధర్వుడు మహ్మద్ రఫి : అమీర్‌బాబు

కడప కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హిందీ చలనచిత్ర రంగంలో తన గాన మాధుర్యంతో స్వర్గీయ మహ్మద్ రఫి గానగంధర్వుడుగా ఖ్యాతిగాంచారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు కొనియాడారు. మహ్మద్ రఫి 100 ఏళ్ల జయంతి సందర్భంగా జుగ్ను ఉర్దూ కల్చరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కడప ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక నేకనామ్ కళాక్షేత్రంలో జరిగిన మహ్మద్ రఫి గానకచేరి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన జేఎన్టీయూ విద్యార్థులు

వేముల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలోని తుమ్మలపల్లెలోని యూసీఐఎల్‌ను పులివెందుల జేఎన్టీయూ ఈసీఈ విద్యార్థులు శనివారం సందర్శించారు. 70వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అలామిక్ ఎనర్జీ ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్ కింద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు వారు తెలిపారు. అడిషనల్ సూపరింటెండెంట్ (మిల్)విపిన్‌కుమార్‌శర్మ, అడిషనల్ సూపరింటెండెంట్ (జియాలజీ) అంజాద్ అలి కార్యక్రమాల గురించి వివరించారు. రోజువారీ కార్యకలాపాలు, మైనింగ్, దాతువు ప్రాసెసింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అనేక అంశాల గురించి విద్యార్థులకు తెలిపారు.

అనంతరం జేఎన్టీయూ ప్రొఫెసర్‌లు, విద్యార్థులకు డీఏఈ మెమెంటో, సమాచార బ్రోచర్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో జీఎం సుమన్ సర్కార్, డీజీఎం కిషోర్ భగత్, కె.లక్ష్మి రంగయ్య, ఎన్.వి. రాజేష్, సోంజోయ్ ఛటర్జీ, వాసుదేవ్‌రెడ్డి, జె.నాగేశ్వరరావు, బివి సుధాకర, ఎస్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ అభినందనీయం

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా శనివారం కడప బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు ఆధ్వర్యంలో కందుల ఓబుళరెడ్డి ఇంజనీరింగ్ కళాలాల మైదానంలో నిర్వహించిన న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ వృత్తి పరంగా ఎప్పుడూ బిజీగా గడుపుతున్న న్యాయవాదులు టోర్నమెంట్ ద్వారా క్రికెట్ ఆడడం మానసికోల్లాసాన్ని చేకూరుస్తుందన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో రాయివంశీకృష్ణ, రామస్వామి, విజయప్రసాద్, సురేంద్రరావు టీమ్‌లు పోటీపడగా విన్నర్‌గా సురేంద్రరావు టీమ్, రన్నర్‌గా జిల్లా రాయివంశీ కృష్ణ టీమ్ నిలిచాయి. విజేతలకు నేడు బహుమతులను అందించనున్నారు. కార్యక్రమంలో పలువురు జడ్జిలు, న్యాయవాదులు పాల్గొని టోర్నమెంట్‌ను తిలకించారు.

నూతిలో పడిన ఆవు వెలికితీత



పంట పొలాలు అనుకుని ఉన్న బావిలో పడిపోయిన ఆవు

సురక్షితంగా బయటపడిన ఆవు

యంత్రం సహాయంతో ఆవును బయటికి తీస్తున్న దృశ్యం

సిద్దవటం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మేతకోసం వెళ్లిన ఆవు పొరబాటున బావిలో పడింది. స్థానికుల సమచారం అందుకున్న పోలాసులు, రెవెన్యూ సిబ్బంది దాన్ని యబటకు తీశారు. వివరాల్లోకెళితే... స్థానిక గాంధీ వీధి వాసి కాటయ్య ఆవు మేత కోసం వెళ్లింది. శుక్రవారం తిరిగి రాకపోవడంతో అతను చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించినా దొరకలేదు. పొలాల్లో ఉన్న బావిలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు పడిపోయిన విషయం తెలుసుకున్న స్థానికులు గ్రామస్థుల సహకారంతో వెలికి తీయడానికి ప్రయత్నించినా ఫలించలేదు. పోలీసులకు, ఇన్‌చార్జి తహసీల్దారుకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన అధికారులు శనివారం ఉదయం యంత్రం సహాయంతో నూతిలో పడిన ఆవును వెలికితీశారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర, వీఆర్వో కేశవులు, స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చిన్నమండెం విద్యార్థిని



చిన్నమండెం, జనవరి25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న వీరగాథ 4.0 వ్యాసరచన పోటీల్లో చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని లోహితారెడ్డి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థాయిలో నిలిచిన లోహితారెడ్డి ఆదివారం విజయవాడలో సన్మానం, ఎస్‌డీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం జ్ఞాపిక, నగదు బహుమతి అందుకోనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొని బహుమతులు పొందినప్పుడే తల్లిదండ్రులు గర్వపడతారని ఉపాధ్యాయులు వివరించారు.

ఢిల్లీ వేడుకలకు మైదుకూరు రైతులు



ఢిల్లీకి చేరిన వెంకటరమణ, మునిసుబ్బమ్మ

కడప రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు మైదుకూరు మండలం వనిపెంట బిందుసేద్య రైతులు కైపు వెంకటరమణ, కైపు మునిసుబ్బమ్మ వెళ్లారు. న్యూఢిల్లీలో జనవరి 26న జరిగే గణతంత్రదినోత్సవాలకు ప్రత్యేక అతిథులుగా ఎంపిక చేశారని జిల్లా సూక్ష్మసాగు పథకం అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈమేరకు బిందుసేద్యంలో కూరగాయల పంటలను సాగుచేసి అధిక దిగుబడి సాధిస్తున్నందున వారికి కేంద్రం నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు వారు ఢిల్లీకి పయనమై వెళ్లారని తెలిపారు.

చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టంగా తనిఖీ చేపట్టాలి

24గంటలు నిఘా ఏర్పాటు



చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న ఎస్పీ

కడప క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టంగా తనిఖీ చేపట్టాల ని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. గంజాయి, అక్రమ మద్యం, నిషేధిత పదార్థాలు, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దువ్వూరు పీఎస్ పరిధిలోని ఇడమడక అంతర్ జిల్లా చెక్‌పోస్టును ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. 24గంటలూ నిఘా పెట్టి ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పంపించాలని చెక్‌పోస్టు సిబ్బందికి ఆయన సూచించారు.

అంధ విద్యార్థినికి కలెక్టర్, జేసీ ప్రశంస



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్, జేసీ

కడప ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల విద్యార్థిని నజియా తుబుసుం దేశభక్తి గీతం పాడడంతో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్ ప్రశంసించారు. కలెక్టర్ సభాభవనంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఇందులో అంధ విద్యార్థిని పాడిన దేశభక్తి గీతం ఆకట్టుకుంది. ఆమెను కలెక్టర్, జేసీ ప్రశంసిస్తూ మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రమణ తదితరులు పాల్గొన్నారు.

కువైట్ కష్టాల నుంచి గట్టెక్కిన మహిళ



బాధిత మహిళ, ఆమె భర్తతో రహమతుల్లా

కడప మారుతీనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్ జోక్యంతో కువైట్‌లో ఎదుర్కొంటున్న నరకయాతనల నుంచి సురక్షితంగా కడప చేరుకున్నట్లు ఎన్‌ఆర్‌ఐ టీడీపీ కువైట్ ఉపాధ్యక్షుడు రహమతుల్లా పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్‌ఆర్‌ఐ టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం ఏజెంట్ల మాటలు నమ్మి కుమారి కువైట్ వెళ్లిందన్నారు. రెండు కాళ్లకు సర్జరీ చేయించుకున్న ఆమె వాళ్ళు చెప్పే పనులు చేయలేక, శేఠ్‌లు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక నరకయాతన అనుభవించింది. ఆ బాధలు భరించలేక ఆత్మహత్యే శరణ్యం అంటూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన వీడియోను ఆమె బంధువుల ద్వారా తమ కార్యాలయాన్ని ఆశ్రయించడంతో మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అంతేకాకుండా కడప నుంచి ఆమెను కువైట్‌కు పంపిన ఏజెంట్‌తో, కువైట్‌లోని శేఠ్‌తో సంప్రదించామన్నారు. కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుమారితో మాట్లాడి సురక్షితంగా ఆమెను కడపకు రప్పించి వారి కుటుంబీకుల వద్దకు చేర్చినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబీకులు మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం 'సీమ' ఆత్మగౌరవం

ఏపీజీబీని తరలించబోమని ప్రకటించాలి ● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎంప్లాయిస్ అసోసియేషన్ వినతి

జమ్మలమడుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు నడిబొడ్డున ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించనని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విన్నవించారు. శనివారం ఉదయం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.మహమ్మద్, ఇతర సంఘాల నేతల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాయలసీమ వాసిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతికి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించకుండా అభివృద్ధి చేయాలన్నారు. జాతీయస్థాయిలో అన్ని బ్యాంకులకంటే మంచి ఆదాయంతో నడుస్తూ అభివృద్ధికి దోహదపడుతూ రుణాలు అందించి గ్రామీణ ప్రజలకు అండదండలు ఇస్తోందన్నారు. అలాంటి బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప జిల్లా కేంద్రంలో రూ.25 కోట్లతో అన్ని వసతులతో నిర్మించిన ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తామని ప్రకటించడం ప్రజలకు, ఆ బ్యాంకుల సిబ్బందిని ఇబ్బంది కలిగించడమేనన్నారు. ఎక్కువ వ్యాపారం ఆర్థికంగా గ్రామీణ ప్రజలకు రుణాలు ఇచ్చి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్న బ్యాంకులను, ఆ కార్యాలయాల రీజియన్ బ్యాంకులను ప్రభుత్వం నిర్లక్ష్యంతో మార్చడం విరమించుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తరలింపును వ్యతిరేకిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా జమ్మలమడుగులో సంతకాల సేకరణ జరిగింది. కడపలో రీజియన్ కార్యాలయాన్ని తరలిస్తే ప్రజలు, బ్యాంకర్లు తిరుగుబాటు తప్పదన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు, అసోసియేషన్ నేతలు, ఇతర సంఘాల నేతలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి తాము అడ్డంకి కాదని, కేవలం గ్రామీణ బ్యాంకులు ప్రజలకు సేవ చేసే ప్రధాన కార్యాలయాన్ని తరలించడం మానుకోకపోతే పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరి రోహిత్ మనోజ్, పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి గురివిరెడ్డి, ఎల్‌ఐసీ నేత నరసింహం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సీపీఎం, వైసీపీ నేతలు దాసు, దన్నవాడ మహేశ్వరరెడ్డి, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, గూడెం చెరువు నాగేశ్వరరెడ్డి, పురుషోత్తంరెడ్డి, దేవగుడి చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

28 నుంచి దేవుని కడప వార్షిక బ్రహ్మోత్సవాలు



కడప కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు 28వ తేదీ ఫిబ్రవరి 7 వరకూ జరుగనున్నాయి. 28న మంగళవారం ఆలయంలో ధ్వజారోహణం, 31న శుక్రవారం శ్రీవారు సింహవాహనంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఫిబ్రవరి 2న గరుడసేవ, 3న తిరుమలేశుని కల్యాణోత్సవం, గజవాహనం, 4న మంగళవారం రథోత్సవం (తిరునాళ్లు) వైభవోపేతంగా జరుగనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాలకు హాజరై తిరుమలేశుని సేవలో తరించాలని కోరారు.

విద్యార్థి శ్రీధర్ అదృశ్యం



వేంపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం శ్రీరామ్‌నగర్ వాసి తమ్మిశెట్టి శ్రీధర్ అదృశ్యమయ్యాడు. ఈనెల 18వ తేదీన ఇంటి నుంచి ఉదయం 8 గంటలకు చక్రాయపేటలో కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద, గ్రామాల్లోను వెతికినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి బంధువులు తెలిపారు. ఎక్కడైన కనిపిస్తే వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని ఎస్ఐ రంగారావు విజ్ఞప్తి చేశారు.

కొండాపురంలో చోరీ

కొండాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాంది షాపు వద్ద చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో శనివారం ఉదయం బంగారు, నగదు చోరీకి గురైంది. ఇంట్లో ఆరు తులాల బంగారు, రూ.60,000 నగదు చోరీకి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వాకిటిపై నున్న తాళం చెవి తీసి బీరువా పగులగొట్టి చోరీ చేసినట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేలం అడ్డుకున్నారని ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వేలం పాటను అడ్డుకున్నందుకు దివంగత మఠాధిపతి వీరభోగ వసంత వేంకటేశ్వరస్వామి సతీమణి మారుతీ మాలక్ష్మమ్మపై ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో శుక్రవారం దేవదాయ శాఖ అధికారులు వేలం నిర్వహిస్తుండగా ఆమె అడ్డుకుందన్నారు. ప్రభుత్వ విధులకు అడ్డుతగిలిందని ఆమెపై ఫిట్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మన ఓటు దేశ భవిష్యత్తు



ర్యాలీలో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు దేశ భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా కేంద్రం యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓటు హక్కుపై ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని, ఏ రకమైన ప్రలోభాలకు లోనవకుండా ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.వెంకటరామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, జాతీయ ఓటర్ల దినోత్సవం ఉద్దేశాన్ని వివరిస్తూ వలంటీర్స్‌చే ప్రతిజ్ఞ చేయించి వైవీయూ నుంచి రేడియో స్టేషన్, శివాజీనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేయించి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు ఛిద్రం : డీటీఓ



పీలేరులో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీఓ ప్రసాద్

పీలేరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబాలను రోడ్డు ప్రమాదాలు ఛిద్రం చేస్తాయన్న సత్యాన్ని గ్రహించి వాహనాలను జాగ్రత్తగా నడపాలని జిల్లా రవాణా అధికారి (డీటీఓ) ప్రసాద్ వాహనదారులకు సూచించారు. 36వ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం పీలేరు ఎంవీఐ కార్యాలయంలో రోడ్డు భద్రతపై డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్టును విధిగా ధరించాలన్నారు. హెల్మెట్లు, సీటు బెల్టుల కారణంగా అనేకమంది ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోగలిగారన్నారు. దేశంలో ఏటా 1.68 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దేశానికి రూ.3 లక్షల కోట్ల మేర నష్టం కలుగుతోందన్నారు. పీలేరు అర్బన్ ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ ఆటోలు, లగేజీ వాహనాలు, స్కూలు బస్సులు నడిపే డ్రైవర్లు బాధ్యతగా మెలగాలని, అధిక లోడు, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రతి వాహనానికీ విధిగా బీమా చేయించాలన్నారు. పీలేరు ఎంవీఐ విజయకుమారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి మొదటి గంట చాలా కీలకమైందని, ఆ సమయంలో చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించిన వారిని కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సమారిటన్'గా గుర్తించి నగదు ప్రోత్సాహం కూడా ఇస్తుందన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు డీఎం బండ్ల కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ ధనలక్ష్మి, 'షీ' సంస్థ అధ్యక్షురాలు పీవీఎస్ లక్ష్మి, రాయల సుధాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేశ్, సభ్యులు శశి, చెంగయ్య, సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఆనందరెడ్డి, వీఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత్రి మాధవి తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా - తప్పిన ప్రమాదం

అనుమానంతో సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



అదుపు తప్పి బోల్తాపడిన లారీ

పులివెందుల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి లారీ రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. శనివారం తెల్లవారు జామున ఎర్రిపల్లె వద్ద ప్రకాశం జిల్లా గురజాల నుంచి సత్యసాయి జిల్లా మడకశిరకు వెళుతున్న బియ్యం లారీ అదుపు తప్పి బోల్తాపడింది. పులివెందుల నుంచి వెళుతున్న బైక్ అడ్డు రావడంతో తప్పించబోయి బోల్తాపడింది. లారీలో 26 కిలోల బస్తాలు 962 ఉన్నాయి. కరెంటు పోల్‌కి ఢీకొట్టడంతో పోల్ విరిగి లారీపై పడింది. వైర్లు కింద పడకపోవడంతో అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. లారీలో రవాణా అయ్యేది రేషన్ బియ్యం అనే అనుమానంతో లారీని సీజ్ చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కలమల్ల-ముద్దనూరు రైల్లేస్టేషన్ల మధ్యలో చిన్నగాళ్ల బుజ్జి(49) శనివారం రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈమె సున్నపురాళ్లపల్లె వాసిగా గుర్తించి మానసిక స్థితి బాగాలేనట్లు తెలిపారు. మృతురాలికి భర్త ఏసయ్య, ఇద్దరు ఆడ పిల్లలు, కుమారుడు ఉన్నారన్నారు. కేసునమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కెరియర్ అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు కెరియర్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌పై అవగాహన పెంచుకోవాలని అస్లీలర్న్ టెక్నాలజీస్ ఎండీ అలీ(బెంగళూరు) పేర్కొన్నారు. స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు కెరియర్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీరింగ్ చదువుతో పాటు భవిష్యత్‌లో తీసుకోబోయే కోర్సులు, ఉద్యోగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, హెచ్‌వోడీలు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ బాలికల లీగ్ పోటీలు

మదనపల్లె టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియాలో భాగంగా దేశ వ్యాప్తంగా బాలికలకు ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహిస్తోందని అన్నమయ్య జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ పేర్కొన్నారు. జిల్లా నుంచి ఆరు జట్లను ఎంపిక చేశామన్నారు. 27వ తేదీ నుంచి ఫిబ్ర వరి 7వ తేదీ వరకు జడ్పీహైస్కూల్ మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

పులివెందుల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మోటున్తూతలపల్లెలో గడ్డం గంగాధర్‌పై దాడి జరిగింది. శనివారం పొలం నుంచి ఇంటికి వెళుతుండగా మాటు వేసి ఆర్.గంగాధర్ అనే వ్యక్తి కొట్టినట్లు తెలిపారు. గంగాధర్ మాట్లాడుతూ తనకు ఎలాంటి కక్షలు, గొడవలు లేకపోయినా అనవసరంగా దాడి చేశాడన్నారు. వెనక నుంచి దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. తనకు ఆర్.గంగాధర్‌తో ప్రాణహాని ఉందని అందుకే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

మాంసం దుకాణ యజమానులకు నోటీసులు

కలికిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో మాంసం దుకాణాలు తెరవకూడదని కలికిరి పంచాయతీ కార్యదర్శి అశోక్ దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు. తొందరపడి అమ్మకాలు జరపొచ్చనే అనుమానంతో కార్యదర్శి సొంతంగా నోటీసులు అందజేశారు.

సైన్స్ ఫెయిర్‌లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

కలకడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మలాంషా వలి తెలిపారు. పుదిచ్చేరిలోని ఓల్డ్‌పోర్ట్ మైదానంలో 20 నుంచి 25 వరకు నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ఎనిమిది రాష్ట్రాల నుంచి మొత్తం 270 నమూనాలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో విద్యార్థులు మహ్మద్ సూహేల్, రహాన్ తయారు చేసిన బయోఎంజైమ్స్ రాకెట్ నమూనా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమఃశివాయ ప్రశంసాపత్రం అందించారన్నారు.

ఓటుకు నోటు..సమాజానికి చేటు



జమ్మలమడుగు పాత బస్టాండు గాంధీవిగ్రహం వద్ద మానవహారం చేస్తున్న రెవెన్యూ అధికారులు, విద్యార్థులు

జమ్మలమడుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేసి సమావేశంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బూత్‌స్థాయి అధికారులకు అవార్డులు అందజేయడం జరిగింది. అత్యధికసార్లు ఓటు వేసిన సీనియర్ సిటిజన్లను సన్మానించి యువ ఓటర్లకు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీడీపీవో రాజేశ్వరి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు వివేకానంద రెడ్డి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సతీష్, మండలాల అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, బీజేపీ నాయకుడు లక్ష్మీనారాయణశెట్టి, మండల మహిళా సమాఖ్య అధికారి గురుకుమార్, విశ్రాంత ఎంఈవో పరమేశ్వరయ్య, ఎక్సైజ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం..: ఓటు హక్కు ప్రతి పౌరునికి వజ్రాయుధమని పంచాయతీ కార్యదర్శి మాధవ రెడ్డి అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించి సీనియర్ సిటిజన్లను సన్మానించారు. సర్పంచ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బద్వేలు..: పట్టణంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాగభూషణం కళాశాల, పట్టణ బాలుర పాఠశాల ఆవరణం నుంచి అధికారులు, విద్యార్థులు,ఎన్‌సీసీ కేడెట్స్‌తో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు , ఎన్‌సీసీ కేడెట్లు పోలీసులతో కలిపి జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి బద్వేలు ఎంపీడీవో మల్లేశ్వరి, గోపవరం ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, బద్వేలు అర్బన్, రూరల్ సీఐలు రాజగోపాల్, నాగభూషణం, బద్వేలు, గోపవరం మండలాల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ, డిగ్రీకళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కాశినాయన..: ప్రజాస్వామ్యదేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దారు వెంకటసుబ్బయ్య,డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నర్సాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ రామక్రిష్ణారెడ్డి,జూనియర్ అసిస్టెంట్ శ్రీవైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు..: అర్హత కలిగినవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు రమాకుమారి కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం చాపాడులో అధికారులు ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను శాలువాలు కప్పి అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు క్రిష్ణారెడ్డి, నారాయణరెడ్డి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, వీఆర్వోలు, వీఏవోలు పాల్గొన్నారు.

దువ్వూరు..: దువ్వూరులో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద నుంచి మండలంలోని మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ దుర్గన్న,డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: తహసీల్దారు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ర్యాలీగా బయల్దేరి ఐదురోడ్ల కూడలికి చేరుకుని అక్కడ జిల్లా పరిషత్ బాలుర, బాలికల విద్యార్థులతో శ్రీవెంకటేశ్వర డిగ్రీకళాశాల విద్యార్థులతో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యల్లటూరు సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మాధవీరెడ్డి, హెడ్మాష్టర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: ఓటు దేశ సార్వభౌమాధికారాన్ని నిర్ణయిస్తుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్‌జడ్జి వై.జె. పద్మశ్రీ పేర్కొన్నారు. శనివారం పట్టణం లో ఉన్న ఎస్సీ హాస్టల్-1, ఎస్సీహాస్టల్-2,బాలికల వసతిగృహాలను ఆమె తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ప్రతి ఓటరు సమాజంపై అవగాహన పెంచుకోవాలని ప్రొద్దుటూరు ఈఆర్వో శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటర్లతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య , మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అజయ్ బాబు, డిప్యూటీ తహసీల్దారు సాయి నాథ్‌రెడ్డి ఆర్ఐ వీఆర్వో లు పాల్గొన్నారు.కాగా మున్సిపల్ కమిష నర్‌మ ల్లికార్జున ఆధ్వర్యంలో మున్సిపల్ గాంధీ పార్కులో మున్సిపల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేపట్టారు.మున్సిపల్ డీఈలు ఏఈలు రెవిన్యూ ఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గణతంత్ర దినోత్సవం

జమ్మలమడుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు జరుగుతాయని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, కోఆప్షన్ మెంబర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

రాజుపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ఎంపీపీ ఎస్ఏ.నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ సభాభవనంలో ఎంపీపీ సలోమి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ షాకీర్‌ఆలీఖాన్, ఏవో శివరామక్రిష్ణారెడ్డి, సీడీపీవో అరుణకుమారి, హౌసింగ్ ఏఈ శేఖర్, ఉపాధి పథకం పీవో లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలను తెలియజేయండి

జమ్మలమడుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శనివారం 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమగ్ర నివేదిక సమావేశం జరిగింది. ముందుగా చైర్‌పర్సన్ శివమ్మ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. వెంటనే మున్సిపల్ వైస్‌చైర్మన్-2 సింగరయ్య తదితర కౌన్సిలర్లు డ్రైనేజీ సమస్యలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, వారి సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణించరాదు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహనాల్లో పరిమితికి మించి ఎవరూ ఆర్టీవో మురళీధర్ తెలిపారు. 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ రఘునాథ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సిద్దేశ్వర్‌రావు, ఎంవీఐ రవీంద్రనాయక్, హేమ కుమార్, ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ దేవకిరణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

జమ్మలమడుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని రెవెన్యూ పరిధిలో ప్రజా సమస్యలను రెవెన్యూ అధికారులు తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సాయిశ్రీతో చాంబర్‌లో భూపేశ్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలోని సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

'గ్రూప్ వర్కులు రద్దు చేయకుంటే సమ్మె చేస్తాం'

ప్రొద్దుటూరు , జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు రోజు వారీగా వార్డులలో పారిశుధ్య విధులు నిర్వహిస్తామని ప్రత్యేకంగా గ్రూప్ వర్కులు పెట్టి కార్మికులకు పనిభారం పెంచుతున్నారని ఇలాగే కొనసాగితే సమ్మెలోకి వెళతామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్ తేల్చి చెప్పారు. శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు.కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా రహదారి భద్రత నియమాలను పాటించాలని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతావారోత్సవాల సందర్భంగా శనివారం ప్రొద్దుటూరు పరిసర ప్రాంత పాఠశాలల, కళాశాలల బస్సు డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, క్లీనర్ల, మెకానిక్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీఐలు రవీంద్ర నాయక్, హేమకుమార్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు మందులు పంపిణీ

చాపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 427 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కోసం మందులు పంపిణీ చేసినట్లు చాపాడు పశువైద్య అధికారి మహమ్మద్‌గౌస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కడప అసిస్టెంట్ డైరెక్టర్ రమణారెడ్డి, వీఎల్‌వో వెంకటేశ్వర్లు, జేవీవో చలపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడి బూడిద రవాణాపై కౌన్సెలింగ్

ఎర్రగుంట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ నుంచి రవాణా అవుతున్న తడిబూడిదపై ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు ట్రాన్స్‌పోర్టర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శనివారం ఆయన కాంట్రాక్టర్స్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సమావేశం నిర్వహించారు. తడి బూడిద ఆర్టీపీపీ నుంచి లారీల్లో, టిప్పర్లలో తీసుకెళ్లే సమయంలో అది రోడ్లపై కారుతోందన్నారు. ఇది ఆరిపోయిన తర్వాత గాలికి లేస్తోందని, దీని వల్ల వాహనాల రాకపోకలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే చుట్టుపక్కల గ్రామాలలో నివసించేవారికి కాలుష్యం పెరిగిపోతోందన్నారు. బూడిద రవాణా చేసే టిప్పర్లు, లారీలు అలాగే హిటాచి వారు ఇకపై తడి బూడిదను రవాణా చేయకూడదన్నారు. ఇకపై ఆరిపోయిన బూడిదను మాత్రమే రవాణా చేయాలన్నారు. వాహనం నుంచి బూడిద కిందపడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు.

యూరియా కొరత తీర్చి రైతులను ఆదుకోవాలి

పోరుమామిళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రోమోర్ షాపులో ఎరువులు, పురుగు మందులు నిల్వ ఉంచి రైతులకు పంపిణీ చేయాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, కేశవ, చెన్నయ్య అన్నారు. శనివారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ యూరియా ఆరు రోజుల నుంచి లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రస్తుతం మొక్కజొన్న, సజ్జ, వరి, మిరప, టమోటా లాంటి పంటలకు సీజన్ టైంలో వారంరోజుల నుంచి యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తుమ్మలపల్లెలో లేగదూడల ప్రదర్శన

బి.కోడూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో శనివారం జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కడప పశువైద్య ఉప సంచాలకుడు రమణయ్య, సహాయ సంచాలకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. అనంతరం కృత్రిమ గర్భం ద్వారా పుట్టిన 84 దూడలను పరిశీలించారు.అందులో ఆరోగ్యవంతంగా ఉండే దూడ రైతుకు రామసుబ్బారెడ్డికి మొదటి బహుమతి, రెండో బహుమతి చెన్నారెడ్డికి, మూడో బహుమతి చిన్నసుబ్బరాయుడుకు అందించారు. కార్యక్రమంలో జిల్లా డీఎల్‌డీఏ వైద్యాధికారులు శివరామిరెడ్డి, లక్ష్మీనరసయ్య, సంధ్యారాణి, శివనాగరాజు, నరసింహ, జయేంద్ర రవి , రైతులు పాల్గొన్నారు.

వీధి లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే





మైదుకూరు రూరల్ ,జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డు,బద్వేల్ రోడ్డులలో నూతనంగా నిర్మించిన వీధి లైట్లను శనివారం పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ప్రొద్దుటూరులో రోడ్డులోని అన్నా క్యాంటీన్ వద్ద ఎమ్మెల్యేకు యాపారాల చిన్న ఆహ్వానం పలికారు. బద్వేల్ రోడ్డులో పొట్టి శ్రీరాముల విగ్రహం, కడప రోడ్డులో అంబేడ్కర్,యోగివేమన నూతన విగ్రహాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ యాపరాల చిన్న,మాజీ సర్పంచ్ బీఎన్ శ్రీనివాసులు, ధనపాల జగన్, యుగంధర్,రవి,బండి అమర్‌నాథ్,తుపాకుల రమణ,ఆకుల క్రిష్ణయ్య,ఆర్ శ్రీనివాసులు, పాలమాబు,పిచ్చపాటివీరారెడ్డి,దాసరి చిన్న బాబు పాల్గొన్నారు.